ఫైలు

పగలు సోడియం వేపర్ లైట్‌ని, రాత్రి పూట మెర్క్యురీ లేంప్‌ని వెలిగించుకొని తనను సృష్టించిన దేవుడికోసం వెతుకుతోంది ప్రకృతి. కానీ ఇప్పటి వరకూ ఆ దేవుడు కన్పించలేదు.

ఒక ఫైలుకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని వెతుకుతున్నట్టు వెతుకుతున్నారు.

దేవుడు కనిపించనట్టే ఆ ఫైలు కూడా కనిపించలేదు.

దేవుడు కనిపించకపోయినా కాలచక్రం ఆగదు. సృష్టి ధర్మం ఆగలేదు. దేవుడ్ని నమ్ముకున్న భక్తుల బతుకులకు ఏలోటు ఏర్పడలేదు. కానీ ఆ ఫైలు కనిపించకపోయేసరికి ఒక ఆఫీసర్ సర్వీసుకి మాత్రం ముప్పు ఏర్పడింది.

ఈ లెక్కన దేవుడికన్న ఫైళ్ళే గొప్పవి.

ఇంతకీ ఆ ఫైలు గొప్పదనమేమిటంటే- ఆ ఊర్లో ఒక ఖాళీ స్థలముంది. ఒకటంటే ఒక్కటే ఉందని కాదు. ఆ ఊర్లో ఉన్న అనేకానేక ఖాళీ స్థలాల్లో అదొకటి. దానిమీద ఒక చోటా నాయకుడి కన్నుపడింది.

వెయ్యి కోడిపిల్లల్ని వందెకరాల మైదానంలో వదిలేసి ఒక్కటీ గద్ద ఎత్తుకుపోకుండా కాపాడుకోవచ్చు. భారత సైన్యం ఆయుధాల్లేకుండా కార్గిల్‌కి వెళ్ళి పాకిస్తాన్ వాళ్ళకు దొరక్కుండా తిరిగివచ్చేయ్యొచ్చు. కానీ మున్సిపాల్టీలోని ఖాళీ జాగాల్ని మాత్రం నాయకుల బారి నుండి కాపాడటం ఎవరి తరం కాదు.

రావాణాసురుడి నుండి సీత ఎలా తప్పించుకోలేకపోయిందో, దుర్యోధనుడి దృష్టి నుండి ద్రౌపది ఎలా తప్పించు కోలేకపోయిందో- మన చోటా నాయకుడి దృష్టి నుండి ఆ ఖాళీ స్థలం అలా తప్పించుకోలేకపోయింది.

రాత్రికి రాత్రి దాని చుట్టూ కంచె పాతేసి ఈస్థలం నాది అన్నాడు చోటానాయకుడు. ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్ ఇమ్మన్నాడు. కమీషనర్ ఇవ్వను పొమ్మన్నాడు. రెవెన్యూ ఆఫీసునుండి అడంగల్ కాపీ, ఎఫ్.ఎమ్.బి స్కెచ్ తెచ్చాడు. దాంట్లో గ్రామ గుత్తమని గానీ, మున్సిపల్ స్థలమని గానీ లేదు. పట్టా స్థలం అని మాత్రం ఉంది. కాబట్టి అది నాదే అంటాడు.

నీదెలాగయ్యిందంటే, నాదికాకపోతే మరెవరిదో మీరే చెప్పండంటాడు. మా కెలాగు తెలుస్తుందంటే, మీకు తెలియకపోతే నేను చెబుతున్నాను గదా అది మా పూర్వీకులది అంటాడు. కాగితాలు చూపించమంటే పోయినాయి అంటాడు.

ఇలా అడ్డుగోలు వాదనలెన్ని చేసినా మున్సిపాల్టీ వాళ్ళు మాత్రం ప్లాను ఇవ్వలేదు. పెద్దపెద్ద వాళ్ళందరి చేత ఫోన్లు చేయించాడు. కానీ కమీషనర్ లొంగలేదు. ఆఖరుకి ఎ.సి.బి. వాళ్ళకు పట్టిస్తానన్నాడు. అయినా ప్లాను రాలేదు.

దీర్ఘాశి విజయభాస్కర్

> **ఆ ఫైలు రాదు- కనబడదు. ఎవడి దగ్గరపోయిందంటే చెప్పరు. ఎప్పుడు పోయిందంటే చెప్పరు. పిల్లిమీద ఎలక, ఎలకమీద పిల్ల ఒకరిమీద ఒకరు తప్పులు నెట్టుకుంటున్నారే తప్ప ఫైలు మాత్రం ఎవడూ తీసుకురాడు.**

పంచాంగం లేకపోతే గ్రహాలు తిరగడం మానేస్తాయా? అలాగే ప్లానులు లేకపోతే ఇల్లు కట్టడం ఆపేస్తారా? ఎవ్వరూ ఆపరు. అలాగే మన చోటా నాయకుడు కూడా ఆపలేదు. ఆ సంగతి మున్సిపాల్టీ వాళ్ళకు తెల్సింది. కమీషనర్ వెళ్ళి ఆపమన్నాడు. ఆపను పొమ్మన్నాడు. పైగా కోర్టు ఇచ్చిన స్టే ఆర్డరు చూపించాడు. దమ్ముంటే ఆపమన్నాడు. కంటెప్ట్ వేస్తానన్నాడు. జైల్లో పెట్టిస్తానన్నాడు. ఉద్యోగం లోంచి తియ్యిం చేస్తానన్నాడు.

కమీషనర్ కోర్టుకెళ్ళి ఆరాతీస్తే, ప్లాన్ అప్రూవ్ చేసికూడా దురుద్దేశంతో ఇల్లు కట్టడానికి కమీషనర్ అబ్జెక్షన్స్ చేస్తున్నాడని, ఇన్ ది ఇంటరెస్ట్ ఆఫ్ నేచరల్ జస్టీస్ స్టే గ్రాంట్ చెయ్యాలని చోటా నాయకుడు వేసిన పిటిషన్, దాంతో పాటు తన సంతకం లాంటి సంతకంతో ఉన్న ప్లాను జిరాక్స్ కాపీ కనబడింది.

వాటి జిరాక్స్ కాపీలు తీసుకొని ఆఫీసుకొచ్చి చోటా నాయకుని ఫైలు తీసుకురమ్మన్నాడు కమీషనర్.

ఆ ఫైలు రాదు- కనబడదు. ఎవడి దగ్గరపోయిందంటే చెప్పరు. ఎప్పుడు పోయిందంటే చెప్పరు. పిల్లి మీద ఎలక, ఎలకమీద పిల్ల ఒకరిమీద ఒకరు తప్పులు నెట్టుకుంటున్నారే తప్ప ఫైలు మాత్రం ఎవడూ తీసుకురాడు.

కమీషనర్‌కి ఒళ్ళుమండి టౌన్ ప్లానింగ్ క్లర్కు మీద యాక్షన్ తీసుకోమని వాళ్ళ డైరెక్టరుకి లెటరు రాసాడు. అలాగే సబ్జెక్ట్ క్లర్క్ మీద యాక్షన్ తీసుకోవడానికి చైర్మన్‌కి నోటు పంపాడు.

ఇటు చైర్మన్ పలకడు- అటు డైరెక్టరు ఉలకడు. చూసి చూసి జడ్జి మాత్రం ఉరిమాడు. ఇన్ని రోజులైనా సరైన సాక్ష్యాధారాలు కోర్టుకు చూపించనందున కమీషనర్‌కున్న మాలిఫైడ్ ఇంటెన్సన్స్‌ని నమ్ముతూ, స్లాక్‌నెస్ ఇన్ సూపర్‌విజన్ ఓవర్ సబార్డినేట్స్‌గా స్ట్రిక్చర్స్ పాస్ చేస్తూ తగిన చర్య తీసుకోవాల్సిందిగా హెడ్డాఫీసుకి రాయడం జరిగింది.

రెండు ఇంక్రిమెంట్లు కట్ అని రెండు రోజుల్లోనే తాకీదులు వచ్చాయి.

కమీషనర్‌కి దేవుడంటే భయం లేదు గానీ, ఫైళ్ళంటే మాత్రం గుండెల్లో రైళ్ళు పరుగెడతాయి.

అందుకే దేవునికన్న ఫైళ్ళు చాలా గొప్పవి. ●